క్లుప్తంగా

కాంగ్రెస్‌లో జెడ్పీటీసీ చేరిక



జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జెడ్పీటీసీ సరస్వతమ్మ, తదితరులు

కొండమల్లేపల్లి : మండలానికి చెందిన జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, ఆమె కుమారులు పస్నూరి వెంకటేశ్వర్‌రెడ్డి, పస్నూరి యుగేంధర్ రెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఆయన కుమారుడు రఘువీర్‌రెడ్డి సమక్షంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనా విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, దూదిపాల వేణుధర్‌రెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన మాజీ మంత్రి జానారెడ్డి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి జానారెడ్డి, ఆయన కుమారులు

హాలియా : తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డితో ఆయన కుమారులు రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీవిద్యారాజు

మాడుగులపల్లి : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు అన్నారు. గురువారం మండలంలోని గుర్రప్పగూడెంలో రూ.5లక్షల ఎస్‌ఆర్ ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మండలంలోని చెరువుపల్లి, దాచారం, ఇందుగుల గ్రామాలకు రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆగామోత్కూర్ ఎంపీటీసీ షఫీ, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, అంజన్‌కుమార్, నాగరాజు, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి



విజయ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నిడమనూరు : మండలంలోని సోమోరిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి ముప్పారం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు నలుగురిని సభ్యులుగా నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కార్యక్రమంలో సభ్యులు గణపురం స్వాతి, మర్రి శ్రీను, గూడపూరి నాగమ్మ, పున్నయ్య, దేవస్థానం ఈఓ నవీన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు యడవెల్లి రంగశాయిరెడ్డి, మేరెడ్డి వెంకట్రామహుల్, సత్యం, వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి, శ్రీను ఉన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన విజయ్ డ్రాయింగ్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు చిత్రకారుడు యినుగుర్తి విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. క్రియేటివిటీ అండ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ గుంటూరు వారు నిర్వహించిన 18వ జాతీయ బాలల చిత్రపోటీలతో పాటు ప్రదర్శనలో 3వ తరగతి విద్యార్థి పి.ఆధ్య, 4వ తరగతి విద్యార్థి జి.వరేణ్య, 8వ తరగతి విద్యార్థి కె.లిఖితలు వేసిన చిత్రాలకు బంగారు పథకాలు, 3వ తరగతి విద్యార్థి ఆధ్య, నాల్గొవ తరగతి విద్యార్థి ఎ.విహాన్‌రెడ్డి వేసిన చిత్రాలకు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఆయన తెలిపారు.

రైతన్న ఆశలు ఆవిరి..!

- భూగర్భజలాలు తగ్గి వట్టిపోతున్న బోర్లు, బావులు
- సాగుకు నీరులేక ఎండుతున్న పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు



జయరాంతండాలో ఎండిపోయిన వరిపొలం



ఎండిన నాయినవానికుంట చెరువు

పెద్దవూర : వేసవి రాకముందే భూగర్భజలాలు తగ్గి బోర్లు, బావులు వట్టిపోయి పంటలు ఎండుతుండడంతో రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతమైన పెద్దవూర మండలంలో బోర్లు, బావులు, చెరువుల కింద ఈ యాసంగిలో రెండు వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. మండలంలోని జయరాంతండా, పాల్తీతండా, పర్వేదుల, సుద్దబావితండా, నాయినివానికుంటతండా, పోలేపల్లి, ఏనెమీదిగూడెం, పోతునూరు, పర్వేదుల తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నా ఏమీ చేయలేని నిస్సాహాయ స్థితిలో రైతులు ఉన్నారు. పక్కనే నాగార్జునసాగర్ జలాశయం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులు ఉన్నా వందలాది ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోతున్నాయి. రైతులు పంటలను కాపాడుకోవడానికి నానా పాట్లు పడుతున్నా ఫలితం లేకుండా పోయింది.

వారబందీతో మోతాదులోనే పంటల సాగు..

ఈ ఏడాది ఆశించిన స్థాయిలో నాగార్జునసాగర్ జలాశయానికి నీరు రాలేదు. దీంతో జలాశయంలో ఉన్న నీటిని ఏఎమ్మార్పీ కాల్వలకు వారబందీ ప్రకారం నీటిని విడుదల చేస్తారని మండల రైతులు బోర్లు, బావులు, చెరువులు, వాగుల కింద తమకున్న వ్యవసాయ భూముల్లో కొద్ది మోతాదులో యాసంగిలో వరి సాగు చేశారు. ఈ వేసవి ప్రారంభంలోనే భూగర్భజలాలు అడుగంటిపోయి చెరువులు, కుంటలు ఎండిపోయాయి. బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. యాసంగి సీజన్ ప్రారంభంలో ఆగకుండా రోజంతా రెండు, మూడు ఇంచులు పోసిన బోర్లు సైతం ప్రస్తుతం ఐదు నిమిషాలు ఆగితే నిమిషం సేపు పోసే పరిస్థితి ఏర్పడింది. కనీసం ఏఎమ్మార్పీ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులను, కుంటలను నింపితే భూగర్భజలాలు పెరిగి బోర్లు పోసేవని రైతులు వాపోతున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు చేసేది లేక ఎండిపోయిన పంట పొలాల్లో పశువులను మేపుతున్నారు. కొందరు రైతులు వేసవిలో పశుగ్రాసానికైనా పనికి వస్తుందని ఎండిన వరిపొలాలను కోసి వాముగా వేస్తున్నారు.

వరి పొట్ట దశలో ఎండిపోయింది



తనకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగుచేశాను. నాలుగు బస్తాల విత్తనాలు తెచ్చి నారు పెంచి నాట్లు వేశాను. ఎందుకో నాటు వేసిన తర్వాత ఎండిపోయింది. మరలా పొలాన్ని దమ్ము చేయించి నారును కొనుగోలు చేసి నాటించాను. పంట ఎదుగుదలకు రెండు పర్యాయాలు కాంప్లెక్స్ ఎరువులు, యూరియా వేశాను. తీవ్రమైన ఎండలకు భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు వట్టిపోయాయి. దీంతో తీరా పొట్టదశకు వచ్చే సరికి నీరు లేక పూర్తిగా ఎండిపోయింది. చేసేది లేక పశువులకు మేపుతున్నాను.

– రమావత్ శ్రీరాములు, జయరాంతండా

రూ.60వేల పెట్టుబడి అయ్యింది



ఏఎమ్మార్పీ కాల్వలకు నీటిని విడుదల చేస్తారని భావించి తనకున్న బోరు కింద మూడెకరాల్లో వరి సాగు చేశాను. రూ.60వేల పెట్టుబడి అయ్యింది. గత సంవత్సరం సైతం సకాలంలో వర్షాలు కురవకపోవడంతో దిగుబడులు రాక రూ.లక్ష అప్పు అయ్యింది. ఈ ఏడాదైనా అప్పులు తీర్చుదామని మరలా అప్పులు తెచ్చి వరిసాగు చేస్తే తీరా పంట చేతికి వచ్చే దశలో పూర్తిగా ఎండిపోయింది. గతంలో చేసిన అప్పులు, ఈ ఏడాది చేసిన అప్పులు కలిపి రూ.2లక్షల అప్పులు మిగిలిపోయాయి.

– పాల్తీ మంగ్లా, పాల్తీతండా

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

డిండి : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని దాసరినెమలిపూర్‌లో కొనసాగుతున్న శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కో ఆప్షన్ మెంబర్ జహంగీర్, నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, సురేష్, సుభాష్, కృష్ణ, నర్సింహ, రమేష్ తదితరులు ఉన్నారు.

‘ధరణి’ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

కొండమల్లేపల్లి : భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టింది. అందుకు మండల రెవెన్యూ అధికారులు నేటి నుంచి 17వతేదీ వరకు మూడురోజుల్లో గ్రామాలకు చేరుకుని గతంలో ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తులను పరిశీలించనున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. మండలంలోని 15న కొల్‌ముంతలపహాడ్, చిన్నఅడిశర్లపల్లి, 16న దోనియాల, 17న గాజీనగర్, పెండ్లిపాకల, చింతకుంట్ల గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ధరణి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. మండలంలో ఈనెల 15న చింతపల్లి, యాద్గార్‌పల్లి, 16న తుంగపాడు, నందిపాడు, 17న మిర్యాలగూడ, ఆలగడప గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

త్రిపురారం : ధరణి దరఖాస్తులను పరిష్కరించడానికి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా మండలంలో నేడు 15న త్రిపురారం, బొర్రాయిపాలెం, 16న బాబుసాయిపేట, పెద్దదేవులపల్లి, నర్లకంటిగూడెం, కంపాసాగర్, 17న దుగ్గెపల్లి, అన్నారం, కామరెడ్డిగూడెం, కంపాలపల్లి, కొణతాలపల్లి, బృందావనపురం గ్రామాలకు రెవెన్యూ అధికారులు రానున్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ధరణిలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. అందుకు అధికారులు గ్రామాల్లోని రైతుల వద్దకే రానున్నారు. మండలంలో ఈనెల 15న(నేడు) రాజవరం, యల్లాపురం, తిమ్మయ్యపాలెం, చింతలపాలెం, 16న నేతాపురం, తిరుమలగిరి, శిల్గాపురం, చింతలపాలెం, 17న అల్వాల, శ్రీరాంపల్లి, శిల్గాపురం, తిరుమలగిరి, నెల్లికల్లు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కొనసాగనుంది.

పెద్దవూర : భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. మండలంలో ఈనెల 15న(నేడు) వెల్మగూడెం, ఊట్లపల్లి, 16న తుంగతుర్తి, శిర్సనగండ్ల, పోతునూరు, 17న పులిచర్ల, తమ్మడపల్లి, తెప్పలమడుగు, గర్నెకుంట, పిన్నవూర, పోలేపల్లి, చింతపల్లి, లింగంపల్లి, కొత్తలూరు, సంగారం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన



చింతపల్లి : మాల్ వెంకటేశ్వరనగర్‌లో..



మిర్యాలగూడ టౌన్: పోషకాహారంపై వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమాబేగం

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తుంగపాడులో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమాబేగం గర్భిణులకు, బాలింతలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వదేశీ బొమ్మల తయారీని ప్రొత్సహించడం, ప్రీస్కూల్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఆటా అథారిటి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, నాగమ్మ, నీల, లలిత, బాలికలు తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్ గుండాల వరలక్ష్మి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారించేందుకు ఐరన్‌తో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె.వెంకటమ్మ, బి.విజయలక్ష్మి, పార్వతి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవం

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు మాల్ వెంకటేశ్వరనగర్ ఐసీడీఎస్ సెంటర్లలో గురువారం పోషణ పక్షోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్యకుమారి చిరుధాన్యాలతో గర్భిణులు, బాలింతలకు చేకూరే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తే కేసులు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ టౌన్ : లైసెన్స్‌లు లేకుండా వడ్డీ వ్యాపారం చేసే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు అన్నారు. గురువారం పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి క్రైం రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతమంది వడ్డీలు ఇచ్చేవారు ఇళ్లు, భూములు తాకట్టుపెట్టుకొని, పవర్ ఆఫ్ పట్టా, జీపీఏని చేయించుకుంటున్నారన్నారు. బాధితుడు పూర్తి స్థాయిలో డబ్బు కట్టిన తరువాత తిరిగి ఇవ్వకుండా ఉంటున్నారని, ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. లైసెన్స్ ఉన్న వారి వద్దనే చట్టప్రకారం 5శాతం వడ్డీపై అప్పులు తీసుకోవాలన్నారు. మండలంలో దొంగతనాలు జరుగుతున్నందున ఒక ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ రూరల్ సీఐ కె.వీరబాబు, వన్‌టౌన్ సీఐ సుధాకర్, రూరల్ ఎస్‌ఐ కె.నరేష్ తదితరులున్నారు.

ప్రణాళికతో చదివితే లక్ష్య సాధన ఖాయం



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి

హాలియా : విద్యార్థులు ప్రణాళికతో చదివితే లక్ష్య సాధన ఖాయమని హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్, ఎమ్మార్సీ హైస్కూల్‌లో పదోతరగతి 108మంది విద్యార్థులకు స్థానిక ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఉచితంగా పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ జనార్దన్ గౌడ్ హాజరై మాట్లాడారు. పదోతరగతి అనేది విద్యార్థి జీవితంలో తొలిమెట్టులాంటిదని, విద్యార్థులు నిర్భయంగా ఆందోళన లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుండా కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, వెంకట్రాంరెడ్డి, చిలుకరాజు శ్రీనివాస్, పద్మావతి, అరవింద్, రాజా, జ్యోతిలక్ష్మి, ఆస్మా తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

దేవరకొండ : ఉపాధిహామీ కూలీలకు పనిప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి ఆనంద్ కోరారు. గురువారం మండలంలోని జిల్లేపల్లి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను ఆయన కలిసి మాట్లాడారు.

ఆస్పత్రిలో కిడ్నీ డే వేడుకలు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో కిడ్నీ డే వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస సమరద్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం డయాలసిస్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డయాలసిస్ సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో హాస్టల్‌వర్కర్ మృతి

పెద్దవూర: విధి నిర్వహణలో హాస్టల్ వర్కర్ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీకి చెందిన ఎల్.రాజేశ్వరి(43) మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో విధులు నిర్వర్తిస్తుంది. రోజులాగే గురువారం విధులకు వచ్చిన రాజేశ్వరి మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు భోజనాలు వడ్డించడానికి సిద్ధమవుతున్న సమయంలో చాతిలో నొప్పి వస్తుందని తోటి సిబ్బందికి చెప్పుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆమెను చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు పేర్కొన్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అభినందనీయమని మండల ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు సర్నాల వెంకన్న యాదవ్ ఆర్థిక సహకారంతో కూలింగ్ వాటర్ క్యాన్లను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, రవికుమార్, వెంకన్న, విష్ణుకుమార్, కిషోర్‌నాయక్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

త్రిపురారం : గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని పవర్ ఆర్మీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనావత్ నాగానాయక్ అన్నారు. గురువారం మండలంలోని మాటూర్ గ్రామంలో పవర్ ఆర్మీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా నాగానాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ లాలునాయక్, ఎంపీటీసీ రవి, కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధనావత్ వెంకట్రాం, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ : విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



హాలియా : పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎన్‌ఓ శ్రీనివాస్

మిర్యాలగూడ : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హౌసింగ్ బోర్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, కళాశాల గ్రౌండ్‌కు నాకు గొప్ప అనుబంధం ఉందన్నారు. తన సేవా కార్యక్రమాలను ఇక్కడి నుంచే ప్రారంభిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

వేములపల్లి : మండలంలోని వేములపల్లి, రావులపెంట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు లక్ష్మణ్‌నాయక్, రమేష్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్మోహన్, అయ్యప్పరెడ్డి, వినోద్‌కుమార్, అమరేందర్, సైదిరెడ్డి, కృష్ణయ్య, చైతన్యలత, కోటయ్య, బాబునాయక్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని విద్యాశాఖ మండల నోడల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నోవ, కొంగరి సత్యనారాయణ, రెడ్యా నాయక్, మధుసూదన్, పార్వతమ్మ, వినయ్‌కుమార్, భాను, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని చెన్నాయిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం సైదిరెడ్డి, ఉపాధ్యాయులు గోపి, సత్యనారాయణ, అంజమ్మ, సైదులు, స్వామి, మాలోతు దశరథనాయక్, శ్రీదేవి, శ్రీనివాస్, దుర్గామల్లేశ్వరి, లింగయ్య, జ్యోతి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావొద్దు

హాలియా : విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దని చింతగూడెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అబ్బిరెడ్డి వేమారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసిన పూర్వ విద్యార్థి వట్టికోటి హరీష్, విద్యార్థులకు రెండు నెలల పాటు అల్పాహారం అందించిన దాత కూరాకుల లింగయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం శ్యాంప్రసాద్, ఎండీ పాషా, పురం వెంకటయ్య, సాగర్ల సత్తయ్య, పేర్ల వెంకటేశ్వర్లు, దూసరి మధు, శ్రీనివాస్, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

గుర్రంపోడు : పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పిట్టలగూడెం కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.గీత అన్నారు. గురువారం పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, కె.యాదగిరిరెడ్డి, వీరస్వామి, శేఖర్, రఘునాద్‌రెడ్డి, రేఖ, కమలమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మాడుగులపల్లి : పెండింగ్‌లో ఉన్న ఆశవర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పాములపహాడ్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ఆశవర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని 23మంది ఆశాలు పనిచేస్తున్నారని అన్నారు. వారికి సంబంధం లేని పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా మండల అధ్యక్షురాలు మన్నెమ్మ, కార్యదర్శి కోటమ్మ, కోశాధికారి సైదమ్మ, ఆశాలు శోభ, వెంకటమ్మ, అమీనా, సరిత, రజిత, గోవర్ధన, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. గురువారం నల్లగొండలో డీఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు విద్య నేర్పించాల్సిన ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. అదే విధంగా అక్రమ డిప్యూటేషన్లు వేయించుకోని ఇతర పాఠశాలలకు వెళ్తున్నారని అన్నారు. ఆయన వెంట ఎర్రమాద కుమార్, ఎండీ.సద్దాం, ఎస్‌డీ.ఖాదర్, కుర్ర రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

డిండి : మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు సమీపంలో ఉన్న గంగాభవానీ అమ్మవారికి బోనాల వేడుకను శివపార్వతి ముదిరాజ్ సంఘం డిండి వారి ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ గంగాభవానీ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పోలం శ్రీను, ప్రధాన కార్యదర్శి బల్మూల ప్రేమ్‌కుమార్, కోశాధికారి పోలం మల్లేష్, మేకల కాశన్న, గిరమోని శ్రీను, వెంకటేష్, శ్రీను, లక్ష్మణ్, ఈశ్వర్, రాములు, సుధాకర్, లింగమయ్య, పర్వతాలు ఉన్నారు.

ముదిరాజ్‌లకు మెదక్ ఎంపీ సీటు కేటాయించాలి

మిర్యాలగూడ టౌన్ : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ సీటును ముదిరాజ్ కులస్తుడు నీలం మధుకు కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోల సైదులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట సంఘం నాయకులు మురళి, బంటు సైదులు, బంటు శ్రీను, కోల రామస్వామి, లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి మట్టయ్య, కొంక వెంకన్న, కోల వెంకన్న, కొంక శ్రీనివాస్, దుండిగాల ప్రసాద్, యాదగిరి, బంటు ఎల్లమ్మ, తదితరులున్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 5వ అదనపు జిల్లా న్యాయ మూర్తి జి.వేణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

మిర్యాలగూడ : రాష్ట్రంలో ముదిరాజ్ కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ పట్టణ నాయకుడు బంటు లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట కోల వెంకన్న, అంజయ్య ఉన్నారు.

హామీలు అమలు చేయాలని ధర్నా

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఆలిండియా రైతు సంఘం పిలుపు మేరకు పట్టణంలో ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మంగారెడ్డి, రామ్మూర్తి, వినోద్‌నాయక్, వెంకన్న, గోవిందరెడ్డి, రాంరెడ్డి, శ్రీను ఉన్నారు.

ఉపాధిలేని యువతపై సర్వే

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని కొత్తగూడెంలో 15నుంచి 25ఏళ్లలోపు ఉండి అధికారిక విద్య, సాధారణ ఉపాధి లేని యువతపై సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామంలో కంపచెట్లను తొలగించి రోడ్డుకిరు వైపులా ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జే.నరేందర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ, చైతన్య జనసేవా సంఘం దివ్యాంగ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘం చార్టెర్ అధ్యక్షుడు కోల సైదులు ముదిరాజ్, కార్యదర్శి సింగు రాంబాబు, ట్రెజరర్ శంకర్‌నాయక్ గురువారం తెలిపారు.